క్లుప్తంగా

పేద విద్యార్థికి చేయూత

సూర్యాపేట : పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన పేద విద్యార్థి ఎనగందుల ఉదయ్ సాయికి బీఆర్ఎస్ నాయకుడు గండూరి కృపాకర్ చేయూత అందించారు. ఇటీవల 10వ తరగతి పూర్తి చేసుకుని ఇంటర్మీడియట్ చదివేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థికి సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగదీష్ రెడ్డి చేతుల మీదుగా రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

షీటీం ఆధ్వర్యంలో అవగాహన


మాట్లాడుతున్న షీటీమ్ ఎస్ఐ నీలిమ

చివ్వెంల : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని షీటీమ్ ఎస్ఐ నీలిమ అన్నారు. సోమవారం చివ్వెంల మండల పరిధిలోని జి.తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ మోసాల పట్ల జాగ్రత్తలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. బ్యాంకు ఖాతా, ఏటీఎం, ఓటీపీ వివరాలు ఇతరులకు చెప్పవద్దన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కళాబృందం సభ్యులు ఆట-పాట ద్వారా పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం శైలజ, హెడ్ కానిస్టేబుల్ రాజేందర్, మహిళా కానిస్టేబుల్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

కొత్తగా 51 అడ్మిషన్లు


51 అంకె ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. సోమవారం నాటికి కొత్తగా 51 మంది విద్యార్థులు చేరారు. ఈ సందర్భంగా విద్యార్థులు 51 ఆకారంలో కూర్చొని ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడారు. మండలంలోనే అత్యధికంగా ఈ ప్రాథమిక పాఠశాలలో 136 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి.బాలునాయక్, హెచ్ఎం ఇందిర, సీహెచ్. నాగరాజు, సీహెచ్. వెంకటేశ్వర్లు, బి.యాదగిరి, జి.మంజుల, ఆర్. నాగరాజు, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని కేటాయించాలని వినతి

మద్దిరాల : మండల పరిధిలోని పీఎంశ్రీ ఎంపీపీఎస్‌లో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా ఉపాధ్యాయులను కేటాయించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు ఆ పాఠశాల హెచ్ఎం జహీర్ వినతిపత్రం అందజేశారు. అలాగే అదనపు తరగతులను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

4న ఆలయ భూముల వేలం

నూతనకల్ : మిర్యాలలోని శ్రీసీతా రామచంద్ర స్వామి ఆలయ భూములకు ఈ నెల 4న కౌలు వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మిర్యాలలో దేవాదాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ అధికారి కుశలయ్య, ఎంపీఓ శశికళ, సీఐ నర్సింహారావు, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ హసన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వర్షం కురవాలని జలాభిషేకం


శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

తిరుమలగిరి: వరుణ దేవుడు కరుణించి వర్షం కురుపించాలని కోరుతూ సోమవారం తిరుమలగిరి మండల కేంద్రంలోని శివాలయంలో శివలింగానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అర్చకులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సామూహిక జన్మదినం

తిరుమలగిరి : విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తిరుమలగిరి మండల కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో సోమవారం సామూహిక జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య మాట్లాడారు. కార్యక్రమంలో గొట్టిపర్తి సుదర్శన్‌రావు, నర్సయ్య, రామిరెడ్డి, రాములు, వెంకటయ్య, సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, పద్మారెడ్డి, కృష్ణమాచారి, జయపాల్ రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీతారామయ్య

సుదీర్ఘకాలం సేవలు అభినందనీయం



సూర్యాపేట టౌన్ : ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న ఎస్పీ కె.నరసింహ


భానుపురి : ధర్మారెడ్డిని సన్మానిస్తున్న కలెక్టర్

సూర్యాపేటటౌన్ : సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో సేవలు అందించడం అభినందనీయమని ఎస్పీ కె.నరసింహ అన్నారు. సూర్యాపేట జిల్లా పోలీసు స్పెషల్ బ్రాంచ్‌లో పని చేస్తున్న ఎస్ఐ ఖాజా మొయినుద్దీన్, ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో పని చేస్తున్న ఏఆర్ ఎస్ఐ వెంకటనారాయణ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఇద్దరిని ఎస్పీ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరసింహాచారి, ఏఓ మంజు భార్గవి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్, పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచందర్ గౌడ్, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భానుపురి : ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సాధారణం అని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో హౌసింగ్ పీడీ ధర్మారెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు హౌసింగ్ పీడీ ధర్మారెడ్డి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. అనంతరం ధర్మారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీడీఓ శంకర్, హౌసింగ్ డీఈ జబ్బార్, హౌసింగ్ ఏఈలు పాల్గొన్నారు.

సూర్యాపేట అర్బన్ : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్ ఎస్కే జానీమియాకు ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఆర్వో కళ్యాణి, ఆర్ఐలు జాన్సటి నాగయ్య, ఏశబోయిన శ్రీను, ఎండీ గౌసుద్దీన్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, ఇండ్ల మనోజ్ కుమార్, ఎండీ అజీముద్దీన్, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

తుంగతుర్తి : అంకితభావంతో పనిచేసిన వారికి ఎల్లప్పటికీ గుర్తింపు లభిస్తుందని డీసీసీబీ డైరెక్టర్, సొసైటీ చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు సేవా సహకారం సంఘంలో పదవీ విరమణ పొందుతున్న సీఈఓ వందనపు వెంకటేశ్వర్లు సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు సేవా సహకార బ్యాంకు అభివృద్ధికి వెంకటేశ్వర్లు ఎనలేని కృషి చేశారని అన్నారు. అనంతరం వెంకటేశ్వర్లును సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు, రైతులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. రైతు సేవా సహకార సంఘం ఇన్‌చార్జ్ సీఈఓగా యాదగిరిని నియమించి బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ మోడెం శ్రీలత, యాదగిరి, మజీద్, భిక్షం రెడ్డి, రవీందర్ రెడ్డి, యాకయ్య పాల్గొన్నారు.

నాగారం : అంకిత భావంతో పనిచేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ హరికిషోర్‌శర్మ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎంఆర్ఐగా పనిచేస్తున్న అల్లావుద్దీన్ సోమవారం ఉద్యోగ విరమణ పొందటంతో ఆయనకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం, సీనియర్ అసిస్టెంట్ షఫీ, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


సూర్యాపే అర్బన్ : సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి


నాగారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ అల్లావుద్దీన్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్, సిబ్బంది


తుంగతుర్తి : వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న సొసైటీ చైర్మన్ సైదులు, డైరెక్టర్లు, తదితరులు

జిల్లా కోర్టు ఏజీపీగా సీనియర్ న్యాయవాది ఫరీదొద్దీన్

చివ్వెంల : సూర్యాపేట జిల్లా కోర్టు ఏజీపీగా పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ఫరీదొద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఫరీదొద్దీన్ జిల్లా ప్రధాన కోర్టుతోపాటు, జిల్లా మొదటి అదనపు కోర్టులో మూడు సంవత్సరాల పాటు ప్రభుత్వం తరఫున సివిల్ కేసుల పరిష్కారం కోసం విధులు నిర్వహించనున్నారు. ఫరీదొద్దీన్ సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీ శారదను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీ షఫిఉల్లా, న్యాయవాదులు నూకల సుదర్శన్ రెడ్డి, సీనపల్లి సోమేశ్వర్, బత్తిని వెంకటేశ్వర్లు, రఘురామయ్య, బాలరాజు, అనంతుల సందీప్ కుమార్, కట్ట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారదను మర్యాదపూర్వకంగా కలిసిన ఏజీపీ ఫరీదొద్దీన్

నాగారం సీఐగా నాగేశ్వర్‌రావు



నాగారం : నాగారం సీఐగా డి.నాగేశ్వర్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం నాగారం సీఐగా పనిచేస్తున్న రఘువీర్‌రెడ్డి మల్టీజోన్-6 రాచకొండ ఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. అయితే మల్టీజోన్-6 రాచకొండ ఐజీ కార్యాలయంలో పనిచేస్తున్న డి.నాగేశ్వర్‌రావు బదిలీపై నాగారం సీఐగా వచ్చారు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడారు. నాగారం సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన డి.నాగేశ్వర్‌రావుకు పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పట్టణ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటయ్య

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటయ్యను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పని చేసిన సీఐ వీరరాఘవులు గత నెలన్నర క్రితం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. అయితే అప్పటి నుంచి పట్టణ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగానే ఉంది. నల్లగొండ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న వెంకటయ్య ఇక్కడకు బదిలీపై వచ్చారు. రెండు రోజుల్లో పట్టణ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజలు

సూర్యాపేట : ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ అధికారులు తెలిపారు. సోమవారం 100 రోజుల కార్యక్రమంలో భాగంగా 26వ వార్డులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ మాట్లాడారు. ఇళ్లలోని కూలర్లు, వాడిన టైర్లు, తొట్టీలు తదితర వాటిలో ఎక్కువ కాలం నీరు నిల్వ ఇంచకుండా చూసుకోవాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతను కాపాడితే దోమల వృద్ధిని నిరోధించవచ్చని వివరించారు. వర్షాకాలంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ప్రమాదకరమని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఇళ్లలోని తడి, పొడి, హానికర చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందజేయాలని సూచించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సరఫరా చేసే నీటి నాణ్యతను పరీక్షించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మహిళలు, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తుంగతుర్తి : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో గెస్ట్ సీఆర్‌టీ (కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్) పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ బోయిని లింగయ్య తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇంగ్లిష్, ఫిజిక్స్ సబ్జెక్టులు బోధించడానికి ఆసక్తి ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన అన్నారు. అవసరమైన సర్టిఫికెట్లతో జతచేసి పూర్తిచేసిన దరఖాస్తులను బుధవారం సాయంత్రం 5 గంటలలోపు కస్తూరిబా విద్యాలయ స్పెషల్ ఆఫీసర్‌కు అందజేయాలని సూచించారు. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని స్పష్టం చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిషోర్

సూర్యాపేట : సూర్యాపేట పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ తండ్రి కక్కిరేణి వెంకటేశ్వర్లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యసేవలు పొందుతూ మరణించారు. కాగా సోమవారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సాయంత్రం వారి నివాసానికి వెళ్లి వెంకటేశ్వర్లు చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తుంగతుర్తి : మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన తునికి లక్ష్మమ్మ (60) అనారోగ్యంతో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ సోమవారం లక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ గుండగాని కవిత రాములుగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, మట్టపల్లి శ్రీశైలం, దుర్గయ్య, యాదగిరి, వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : బైక్, ఆటో ఢీకొనడంతో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన సూర్యాపేట రూరల్ మండలం బాలెంల గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజునాయక్ తండాకు చెందిన ఆటో డ్రైవర్ బాలెంల గ్రామంలోని సూర్యాపేట జనగామ రహదారి పక్కన ఉన్న భారత్ పెట్రోల్ బంకులో డీజిల్ ఫిల్ చేయించుకొని రోడ్డు ఎక్కుతుండగా సూర్యాపేట నుంచి జనగామ వైపు వెళ్తున్న బైక్ ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు క్షతగాత్రుడిని ఏరియా హాస్పిటల్‌కి తరలించారు. ప్రమాద సమయంలో ఆటోలో చిన్నపిల్లలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సంక్షిప్త సమాచారం

హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

పెన్‌పహాడ్ : పౌర హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని తహసీల్దార్ లాలు హెచ్చరించారు. సోమవారం చీదెళ్లలోని హరిజన కాలనీలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపికృష్ణ, ఏఆర్ఐ అజీజా బేగం పాల్గొన్నారు.

తిరుమలగిరి : జలాల్‌పురం గ్రామంలో సోమవారం సివిల్ రైట్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ జన్‌మహ్మద్ మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్‌లో చేరిక

సూర్యాపేట : సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై అనేకమంది పార్టీలో చేరుతున్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. సోమవారం పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. పార్టీలో చేరిన వారిలో గుండాల బుచ్చయ్య, గుండాల శివ ఉన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పేర్ల నాగన్న, నరసన్న, సూరం రేణుక, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు

తుంగతుర్తి : రైతులు సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు సాధించవచ్చని డీసీసీబీ డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. గగన్ డ్రోన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గ కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో రైతులకు అగ్రి డ్రోన్‌లపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు గుడిపాటి నరసయ్య, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అర్వపల్లి : మండలంలోని కొమ్మాల గ్రామానికి చెందిన కుంటిగొర్ల ఆంజనేయులు, మర్యాద సైదమ్మలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందింది. అనారోగ్యంతో బాధపడుతున్న వీరి వైద్య ఖర్చుల నిమిత్తం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సిఫారసుతో ఈ నిధులు మంజూరయ్యాయి. ఆంజనేయులుకు రూ. 60,000, సైదమ్మకు రూ. 54,000 మంజూరు కాగా, సోమవారం జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్ రెడ్డి ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండడి పూర్ణచంద్రారెడ్డి, కె. సైదులు, శ్రీనివాసరెడ్డి, గంగదెరి శ్రీనివాస్, వెంకటాద్రి, ఉదయ్, వెంకటరెడ్డి, సుధాకర్ రెడ్డి, విజ్జిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

మద్దిరాల : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్ట్యా గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దని ఎస్ఐ వీరన్న అన్నారు. గతంలో అల్లర్లకు పాల్పడిన పలువురికి సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీసీ రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అర్వపల్లి : అర్వపల్లిలోని ముత్యాలమ్మ దేవాలయానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని, త్వరలో జరగనున్న బోనాల ఉత్సవాలకు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వెంటనే సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. తిరుమలగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ వినతిపత్రాన్ని అందజేశారు. అదేవిధంగా ఇందిరమ్మ పథకం కింద ఇళ్లను స్థానిక శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయ భూముల్లో నిర్మించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని కోరారు. గతంలో కూడా ఇందిరమ్మ పథకం, ఇతర ప్రభుత్వ పథకాల కింద ఈ దేవాలయ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నారని, ఈసారి కూడా ఎలాంటి అభ్యంతరం లేకుండా ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, మాజీ జెడ్పీటీసీ అవిలయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందుర్తి వెంకట్ రెడ్డి, బైరబోయిన సైదులు, మహరాజు, అలువాల వెంకటస్వామి, దల్వాయి శ్రీధర్, పందిరి సురేందర్, వీరయ్య, మనోహర్, వినయ్, మాధవ్, నాని, శ్రీను పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మహాప్రస్థానం పరిశీలన


మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్పీలు

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ సీహెచ్. హనుమంత రెడ్డి సోమవారం పరిశీలించారు. పట్టణంలోని వెజ్-నాన్‌వెజ్ మార్కెట్, మహాప్రస్థానం, అలాగే బాలెంల వర్మీ కంపోస్ట్ యార్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. పట్టణ ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపాలిటీ వాహనాలకు అందించాలని కోరారు. మహా ప్రస్థానాన్ని సందర్శించిన ఆయన, అక్కడ చేపడుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. కాటి కాపరులు మరణించిన వారి కుటుంబాల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు అందాయని, దీనిపై త్వరలో వారిని పిలిపించి మాట్లాడతానని తెలిపారు. అనంతరం పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఆర్ఐలు ఎండీ గౌసుద్దీన్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, ఇండ్ల మనోజ్ కుమార్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, జవాన్లు కొండేటి వెంకన్న, రఫీ పాల్గొన్నారు.


ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి

పౌర హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి అన్నారు. సోమవారం సివిల్ రైట్స్ డే సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు పిల్లలమర్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగంలో పొందుపర్చిన విధంగా ప్రజలు తమ హక్కులను ఉపయోగించుకోవాలని తెలిపారు. ప్రస్తుత సమాజంలో చట్టాలు తెలుసుకోవడం తప్పనిసరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డీటీ లావణ్య, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఏఎస్‌డబ్ల్యూఓ ఇందిర, ఏఎస్ఐ పాండు నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎండీ గౌసుద్దీన్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, టీఎంసీ శ్వేత, సీఓ రోజా, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన ఆర్పీలు

సూర్యాపేట మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన హనుమంతరెడ్డిని సోమవారం ఆర్పీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అన్నెపర్తి రాణి ఆధ్వర్యంలో ఆర్పీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ శ్వేత, ఆర్పీలు కోల మంగా, మంత్రాల పద్మ, నూకల విజయ, పడిశాల నాగమణి, నారా రజిని, రోహిన, దొంతగాని నాగమణి, గోనె విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారి నవరాత్రోత్సవాలు


పిల్లలమర్రిలో విశేష అలంకరణలో అమ్మవారు


పిల్లలమర్రిలో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు


తాళ్లగడ్డ (సూర్యాపేట) : సూర్యాపేట మండలం పిల్లలమర్రి గ్రామంలోని శ్రీనామేశ్వర స్వామి ఆలయ ప్రాగణంలో ఉన్న బ్రహ్మ సమేత శ్రీసరస్వతి దేవి ఆలయంలో వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా సోమవారం ఆలయ ప్రధాన అర్చకుడు మునగలేటి సంతోష్ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, అమ్మవారికి అభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కిరాత వారాహి దేవిని పూజిస్తే విజయాలు

కిరాత వారాహి దేవిని పూజిస్తే అన్నింటా విజయాలు చేకూరుతాయని శ్రీసంతోషిమాత దేవాలయం అర్చకుడు బట్టారం వంశీకృష్ణ శర్మ తెలిపారు. వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణ కేంద్రంలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో అమ్మవారిని కిరాత వారాహి దేవిగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ కిరాత వారాహి దేవి ఉగ్రరూపంతో శత్రువులను నాశనం చేసి భక్తులను రక్షిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు నూక వెంకటేశం గుప్తా, ప్రధాన కార్యదర్శి బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, కమిటీ సభ్యులు బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, బజ్జూరి శ్రీనివాస్, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.


సూర్యాపేటలోని సంతోషిమాత ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

బస్సు సేవలను పునరుద్ధరించాలని వినతి


డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తుంగతుర్తి : తుంగతుర్తి నియోజకవర్గకేంద్రం నుంచి గతంలో నడిపిన ఆర్టీసీ సేవలను పునరుద్ధరించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా అన్నారు. సోమవారం సూర్యాపేటలో బస్సు డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నియోజకవర్గ కేంద్రమైనప్పటికీ తుంగతుర్తికి బస్సు సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఖమ్మం, హనుమకొండకు నిత్యం ప్రయాణిస్తారని, గతంలో నడిపిన సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. డిపోకు నూతనంగా 79 బస్సులు వచ్చాయని, అందులో కొన్నింటిని తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రం నుంచి నడపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నారాయణదాసు నాగరాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ కత్తుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీల బహూకరణ

మద్దిరాల : పోలుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆ పాఠశాలకు రూ.95వేల విలువైన 19 డెస్క్ బెంచీలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కర్నాటి వెంకటేశ్వర్లు లావణ్య, కుదుర్ల శ్రీనివాస్ లక్ష్మి, తాళ్లపెల్లి రవి భవాని, రేసు శ్రీనివాస్ విజయ దంపతులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.